క్లుప్తంగా

సమావేశాల సమయం తగ్గించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్, ఉన్నత పాఠశాలల సబ్జెక్టు టీచర్ల కాంప్లెక్స్ సమావేశాల సమయాలను తగ్గించాలని కోరుతూ డెమొక్రటిక్ పీఆర్‌టీయూ నాయకులు రాష్ట్ర ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వరరావు ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కుదించాలని, ఎఫ్ఏ-2 పరీక్షల ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్ విధానంలో కాకుండా సీఈబోర్డు ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరామన్నాని పేర్కొన్నారు.

లక్ష్మీ గణపతి హుండీ ఆదాయం రూ.3.25 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో స్వామి వారికి హుండీల ఆదాయం మంగళవారం లెక్కించారు. 280 రోజులకు రూ.3,25,848, మూడున్నర కాసుల గ్రాముల బంగారం, 25 గ్రాముల వెండి లభించింది. ఆలయంలో స్వామి వారి ఆభరణాలను దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రిలోని దేవదాయ శాఖ ఆభరణాల తనిఖీ అధికారి ఏవీ దుర్గా భవాని స్వామి వారి ఆభరణాలను తూకంపెట్టి వాటిని రికార్డుల్లో నమోదు చేశారు. హుండీల ఆదాయ లెక్కింపును దేవదాయ శాఖ ఏలూరు జిల్లా అధికారి సీహెచ్ రంగారావు పర్యవేక్షించారు. ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బీఎల్ నరసింహరావు, కార్యనిర్వహణాధికారులు ఎం రాధ, ఎ.రవిశంకర్, సీహెచ్‌వీ నాగమునేశ్వరరావు, సీహెచ్ చిన నాగేశ్వరరావు, పిరీనా మాధురి పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే ఆశయాలను సాధిద్దాం



పూలే దంపతుల విగ్రహ వద్ద నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): కుల రహిత సమాజం కోసం పోరాడిన జ్యోతిబా పూలే ఆశయ బాటలో ముందుకు సాగుదామని న్యూడెమోక్రసీ నాయకులు పిలుపు నిచ్చారు. జ్యోతిబా పూలే సత్యశోధక సమాజ్ స్థాపించి 151 సంవత్సరాలయిన సందర్భంగా స్థానిక జూట్ మిల్లు సెంటర్‌లోని జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడారు. నాయకులు యర్రా శ్రీనివాసరావు, గడసాల రాంబాబు, మంగం అప్పారావు, డి.వీరినాయుడు, సందక అప్పారావు, బి.వీరభద్రం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కె.నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు పోతునూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పోతునూరులో బుధవారం సర్పంచ్ బోదుల స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హాజరవుతారని పేర్కొన్నారు. కేదవరం, పోతునూరు, ఉండ్రాజవరం, లక్ష్మీపురం, దోసపాడు సమీప గ్రామాల్లోని ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాని కోరారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- నగర మేయర్ షేక్ నూర్జహాన్
- తంగెళ్లమూడి యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



తంగెళ్లమూడిలో రోగులకు మందులు అందజేస్తున్న మేయర్ నూర్జహాన్



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



హిమోగ్లోబిన్ పరీక్ష చేయించుకుంటున్న మేయర్ నూర్జహాన్



షుగర్ టెస్ట్ చేస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: పేదల ఆరోగ్యంపై శ్రద్ధతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో ఏన్నడూలేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు తంగెళ్లమూడి అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపును మేయర్ ప్రారంభించారు. రోగులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు వంటి ఏడు రకాల పరీక్షలు చేశారు. రిజిస్ట్రేషన్ స్టాల్, ఫార్మసీ, స్పెషలిస్ట్ వైద్యులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఆయా వ్యాధులకు సంబంధించి నిర్దేశించిన 105 రకాల మందులు ఉచితంగా నెలకు సరిపడా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు టూటౌన్ ప్రాంతంలో గత 15 రోజులుగా ఆరు సచివాలయాల పరిధిలోని 10 డివిజన్లలో ఇంటింటా సర్వే చేశారని చెప్పారు. 134 క్లస్టర్లలో యూపీహెచ్‌సీ వైద్యులు, సచివాలయాల ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టారని తెలిపారు. టూటౌన్ ప్రాంతంలోని 7743 ఇళ్లలో 21,482 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారని చెప్పారు. వివిధ అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న 468 మందికి టోకెన్లు మంజూరు చేశారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల వద్ద ఒక ఫైల్‌క్రియేట్ చేసి సీనియర్, స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేశారని చెప్పారు. టీబీ, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక రోగాలకు అవసరమైతే ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేసేలా చర్యలు చేపట్టారని నూర్జహాన్ వివరించారు. డీఐఓ నాగేశ్వరరావు మెడికల్ క్యాంపు నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, దేవరకొండ శ్రీనివాస్, అర్జి సత్యవతి, ఈదుపల్లి కళ్యాణి, ఇలియాస్ పాషా, జిజ్జువరపు విజయనిర్మల, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, సచివాలయ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, యూపీహెచ్‌సీ వైద్యులు, పార్టీ నాయకులు ఉన్నారు.

మాదేపల్లిలో 323 మందికి వైద్య సేవలు

ఏలూరు రూరల్: పేదలను ఆరోగ్యవంతులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఏలూరు మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని చెప్పారు. గ్రామాల్లో వైఎస్సార్ క్లినిక్‌ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. ఫలితంగా పేదలు ఆరోగ్యంగా ఉంటున్నారని సంతోషం జీవిస్తున్నారని వివరించారు. శిబిరానికి వచ్చిన వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తంగా 323 రోగులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశామని వైద్యులు చంద్రవళి, ప్రదీప్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ కూరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ్, ఉపసర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ, జాలిపూడి సొసైటీ చైర్మన్ బొల్లిముంత రాము, వైసీపీ మండలధ్యక్షుడు తేరా ఆనంద్, ఎంపీడీఓ బి.ప్రణవి, తహసీల్దార్ జె.శ్రీనివాసరాజు, కార్యదర్శి సుమలత తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో ప్రబలుతోన్న వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఒక పక్క గోదావరి పరివాహక ప్రాంతం, మరో పక్క కొల్లేరులో విచ్చలవిడిగా తవ్వుతోన్న చేపల, రొయ్యల చెరువులు, డ్రెయిన్ పూడుకుపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోందన్నారు. దీంతో దోమలు పెరిగి పోతున్నాయని పేర్కొన్నారు. వాతావరణం మార్పులను బట్టి సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు చేసి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఏజెన్సీ, మారుమూల ప్రాంతాలకు మొబైల్ వైద్య బృందాలను పంపి వైద్య సేవలను అందించాలని రవి కోరారు.

శ్రీకృష్ణదేవరాయ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందించిన హెచ్ఎం హరిబాబు

ఏలూరు రూరల్ : ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో ఏలూరు శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని హెచ్ఎం సీహెచ్ హరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న తాడేపల్లిగూడెం భారతీ విద్యాభవన్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలు అండర్-14 విభాగంలో కొత్తపల్లి ధనుష్ 400 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌లో రెండు బంగారు పతకాలు సాధించాడని పేర్కొన్నారు. ఇదే విభాగంలో కె.ధనుష్, కె.దుర్గా వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. పీఈటీలు, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

కల్యాణ మండప నిర్మాణానికి సహకరించండి



సమావేశంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నాయీబ్రాహ్మణుల కల్యాణ మండప నిర్మాణానికి సహకరించాలని నాయీ బ్రాహ్మణ నందయువ సేన గౌరవాధ్యక్షుడు రంభా రాజానంద కోరారు. మంగళవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నాయీబ్రాహ్మణ నంద యువసేన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాజానంద మాట్లాడుతూ ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయీబ్రాహ్మణ కల్యాణ మండపం నిమిత్తం నగరంలోని మాదేపల్లి ఇందిరా కాలనీలో 340 గజాల స్థలాన్ని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మండపం నిర్మాణం నిమిత్తం ఎంపీ, ఎమ్మెల్యేల నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారని, దీని నిర్మాణానికి రూ.40 లక్షలు అంచనావ్యయంగా నిర్ణయించినట్టు చెప్పారు. మిగిలిన రూ.30 లక్షలు విరాళాలు సేకరించాల్సి ఉందన్నారు. దీనికి నాయీ బ్రాహ్మణ వృత్తిదారులు, కళాకారులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ నంద యువసేన విస్తరణలో భాగంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రంభా సతీష్, కార్యవర్గ సభ్యులుగా ముద్దాడ భాస్కర్, పిరిడి త్రినాథ్, సుందరపల్లి మణి, తమ్మిడి ధర్మలను నియమించారు. సమావేశంలో నంద యువసేన ఏలూరు జిల్లా అధ్యక్షుడు తాడివలస పవన్ నంద, నగర అధ్యక్షుడు చిట్టాబత్తుల శ్రీను నంద, నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు ద్రోణాదుల శ్రీనివాస్, అధ్యక్షుడు జీవీ రంగ మోహన్, ప్రధాన కార్యదర్శి ఎంకే దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘాల బ్లాక్‌డే



ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో నినదిస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం బ్లాక్‌డే పాటించారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని, కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినదించారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా రైతులను కార్లతో తొక్కించి హత్య చేసిన కేంద్ర సహాయ మంత్రి కుమారుడు, బీజేపీ గూండాలను తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయాలని, కేసులను రద్దు చేయాలని, వ్యవసాయ చట్టాలను పునరుద్ధరించాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు రాజనాల రామ్మోహనరావు, వివిధ సంఘాల నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, కె.కృష్ణమాచార్యులు, రాయంకుల లక్ష్మణరావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

హక్కులపై దాడిని తిప్పికొట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కులపై ప్రభుత్వాల దాడిని తిప్పికొట్టాలని కోరుతూ డబ్ల్యూఎఫ్‌టీయూ (ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో యాజమాన్యాలు కార్మికులను ఇష్టానుసారంగా దోచుకోవడంతో అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకురావడంతో కార్మికులు హక్కులను కోల్పోతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. డబ్ల్యూఎఫ్‌టీయూ వ్యవస్థాపక దినోత్సవ స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కార్మికవర్గం ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు, జె.గోపి, బి.జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: ఇక గేర్ మార్చి, రాజకీయం చేస్తాం. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయకేతనాన్ని ఎగుర వేస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కుల, మత, ప్రాంతాలకు, వర్గాలకు తావులేకుండా వివక్ష చూపకుండా అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారంతో పథకాలు అందించామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్యంగా దెందులూరు నియోజకవర్గ ప్రజలందరి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. విద్య, వైద్యం, ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాలు వ్యక్తిగతంగా మరిచిపోలేని సంతృప్తిని అందించాయన్నారు. ఏ విషయంలోనూ తమకు టీడీపీ పోటీ కాదని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాను వ్యక్తిగతంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెళ్లి ప్రజలను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసినట్టు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తెలిపారు.

ఫాదర్ జోసఫ్‌ను తొలగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని జలపవారిగూడెంకు చెందిన సుమారు 100 మంది క్రైస్తవులు మంగళవారం ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లపై ఏలూరు వచ్చి బిషప్ హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అన్నదమ్ముల్లా ఆప్యాయంగా ఉండే రెండు కులాల మధ్య అక్కడి చర్చి ఫాదర్ మరపట్ల జోసఫ్ వివక్షను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలోని విచారణను తీసివేసి పాత విధానంలోనే ఉపదేశి మాస్టర్‌తో మందిరాన్ని నడిపించాలని, పండుగ, పర్వదినాలను ఐకమత్యంగా నడిపించే ఫాదర్‌ను నియమించాలని కోరారు. వెంటనే జోసఫ్ ఫాదర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

నేడు ఇళ్ల సర్వేపై అవగాహన

ఉంగుటూరు: ఉంగుటూరులో బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక పంచాయతీ కమ్యూనిటీ హాలులో ఇళ్ల సర్వేపై అవగాహన కల్పించనున్నట్టు ఉంగుటూరు వీఆర్వో కిరణ్, మండల సర్వేయర్ తెలిపారు. మీ భూమి -మా హామీ కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిన విషయం తెల్సిందే. ఈ క్రమంలో శాస్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో వ్యవసాయ భూములు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు, గ్రామ కంఠం భూములను సర్వే చేసి కొలవనున్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- ప్రజల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- నాయుడుగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



నాయుడుగూడెంలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెంలో సోమవారం రాత్రి ఆయన పల్లె నిద్ర చేసి మంగళవారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి మహిళలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ఎస్సీ ఏరియాలో డ్రైనేజీ, రహదారి నిర్మాణం చేయడంపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. వలంటీర్లు ప్రజలకు కావాల్సిన పథకాలు అందించడంలో చురుకుగా వ్యవహరించాలని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారులు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గృహసారథులు, నాయకులు సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీ, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, స్థానిక సర్పంచ్ సిద్ధాబత్తిన జోజమ్మ, ఎంపీటీసీ మారుమూడి కృపామణి స్థానిక నాయకులు పాల్గొన్నారు. నాయుడుగూడెంలో పల్లె నిద్ర చేసి గ్రామంలో నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని శాంతి రథాల కమిటీ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ అప్పక రాంబాబు అన్నారు. భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లోని పేద కుటుంబాలకు, ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. భీమడోలు విద్యార్థులు డి.సాయితేజస్విని, యు.నాని, సీహెచ్ సూర్యతేజ ఒకొక్కరికి రూ.15వేల చొప్పున రూ.45వేల ఆర్థిక సాయం అందించారు. గుండుగొలనులో అనారోగ్యంతో బాధపడుతున్న సామాజిక కార్యకర్త టి.సుమన్‌బాబుకు రూ.5 వేలు, మరో ముగ్గురు సభ్యులు రూ.3 వేలు చొప్పున రూ.8 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఎంఎంపురంలో పక్షవాతంతో బాధపడుతున్న మద్దాల వెంకట రామారావుకు రూ.5వేలు అందజేసారు. పూళ్లలో పేద వృద్ధ దంపతులు కె.పూర్ణయ్య, సిరిబత్తిన భవానీ కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, వైసీపీ నేత సాయిరామ్ క్లాత్ షోరూమ్ అధినేత పున్నం గోపి వస్త్రాలను అందజేశారు. మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకరరావు, కార్యదర్శి అడబాల బాబి తదిరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	32